క్లుప్తంగా

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



సహస్రదీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపం లో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన ఎస్ నటరాజ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శివతాండవం, మూషికవాహన, శివతాండవం, శివశివశంకరా, నమో నమో శివాయ, హర హర శంభో గీతాలకు విజయ, అనిత, సంగీత, యోగి, శశి, హిమబిందు తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేషపూజలు



విశేషపూజల అనంతరం సుబ్రహ్మణ్యస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయం లో సోమవారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకం లో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పరామర్శ



జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న దారా సుధీర్

పగిడ్యాల/జూపాడుబంగ్లా: కుటుంబ సభ్యులను కోల్పోయిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల కుటుంబాలను పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దారా సుధీర్ సోమ వారం పరామర్శించారు. పగిడ్యాల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి సోదరుడు రామ చంద్రారెడ్డి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ కార్యకర్త జూపాడుబంగ్లాకు చెందిన నరసింహయాదవ్ తండ్రి సుంకన్న వారం క్రితం మృతిచెందాడు. దారా సుధీర్ సోమవారం ఆయా కుటుంబాలను కలిసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సూచనలిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి మహమ్మద్ బేగ్, టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ సూచించారు. సోమవారం పాలెంచెరువు గూడెం లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎఫ్‌డీపీ కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీడీ, సిగరెట్, గుట్కా, మద్యం, గంజాయి తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. క్షయ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకుని నయం చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు.

మహిళపై దాడి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో సోమవారం మహిళపై దాడి జరిగినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన అరవ వెంకటలక్ష్మమ్మ (55)పై అదే గ్రామానికి చెందిన దీబగుంట్ల వీరభద్రుడు పాత కక్షలతో కత్తితో దాడి చేసి, తలపై గాయపరిచాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వీరభద్రుడిపై కేసు నమోదు చేశామన్నారు.

యువతకు బాబు వెన్నుపోటు





యువతపోరు కార్యక్రమానికి నంద్యాలకు బయల్దేరిన యువకులు, నిరుద్యోగులు, ఆత్మకూరు నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, నిరుద్యోగులు

నందికొట్కూరు: నిరుద్యోగభృతి ఇస్తానని ఓట్లు వేయించుకుని చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీ నెరవేర్చకుండా యువతకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధురి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఇదాయతుల్లా(లడ్డా), పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన యువతపోరు కార్యక్రమానికి సోమవారం నందికొట్కూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో విద్యార్థి, యువజన విభాగం, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క జాబ్ కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. మోసం చేయడమే చంద్రబాబు నైజమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేసిన చరిత్ర ఆయనకు లేదన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలరు మంగళి కృష్ణ, యువకులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు హామీలతో అధికారంలోకి ..

ఆత్మకూరు: కూటమి నేతలు తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చారని వైఎస్సార్‌సీపీ యూత్ రాష్ట్ర సెక్రటరీ విజయ్‌చౌదరి, విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షులు రియాజ్‌బాషా, మండల అధ్యక్షులు ధనుంజయ, కార్యదర్శి మహబూబ్‌బాషా, పార్టీ మండల, మహిళా సంఘం అధ్యక్షులు సయ్యద్‌మీర్ రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. నంద్యాలలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి సోమవారం ఆత్మకూరు నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈసందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగభృతి చెల్లిస్తామని ఓట్లు దండుకుని మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రానున్న ఎన్నికల్లో యువత తగిన బద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటస్వామిగౌడ్, డాక్టర్ ఈశ్వరసాయి, సిద్దార్థరెడ్డి, నాగరాజు, రఫిక్, తేరుబాషా, జావిద్, నాగరాజు, సుల్తాన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములకు వేలంపాట

బండి ఆత్మకూరు: ఈనెల 25న మండల పరిధిలోని పెద్ద దేవళాపురం గ్రామానికి చెందిన ఆలయాల భూములకు వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రూపు దేవస్థానం ఈఓ నాగ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన వరదరాజ, ఆంజనేయ, లింగమయ్య స్వామి ఆలయాలకు చెందిన 42.80 ఎకరాలకు నిర్వహించనున్న బహిరంగ వేలంపాటల్లో పాల్గొనేవారు రూ.1,000 అపరాధ రుసుము చెల్లించాలన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

ఆత్మకూరు: పట్టణంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలను చూపించాలని, పక్కా గృహాలు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఎంపట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, షేక్‌ఇస్మాయిల్, నబి, శీను పాల్గొన్నారు.

నందీశ్వరస్వామికి పరోక్షసేవ



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. సోమవారం 46 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేష పూజను జరిపించుకున్నారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో, ఫలోదకాలతో అలాగే మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

మల్లన్న సేవలో తెలంగాణ మంత్రి



మంత్రి దామోదర రాజనరసింహాకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన తెలంగాణ మంత్రి దామోదర రాజనరసింహాకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి మంత్రి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈఓ ఎం.శ్రీనివాసరావు మంత్రికి స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

నూనె గింజల సాగుపై దృష్టి సారించాలి



రైతులకు సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెలుగోడు: నూనె గింజల సాగుపై దృష్టిసారించాలని ఏఓ స్వాతి రైతులకు సూచించారు. సోమవారం వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాల్లో నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్ సీడ్స్ అండ్ ఎడిబుల్ ఆయిల్స్ స్కీం ద్వారా వాల్యూ చైన్ క్లస్టర్ ఎఫ్‌పీఓ వేంపెంట శాఖ ఆధ్వర్యంలో 100 శాతం సబ్సిడీతో సోయాబీన్ విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నూనె గింజల పంట ఉత్పత్తులకు దేశ మార్కెట్‌లో ప్రత్యేక డిమాండ్ ఉందన్నారు. దేశ ప్రజల అవసరాల కోసం 55 శాతం నూనె ఉత్పత్తులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నూనె గింజల పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

– **పాములపాడు:** పంటలసాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి సూచించారు.సోమవారం మండలంలోని మద్దూరు గ్రామంలో ఎస్‌ఎంఈఓ కార్యక్రమంలో సబ్సిడీతో సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎక్కువ మోతాదులో రసాయన మందులు వాడొద్దని సూచించారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వెలుగోడు: డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బలిదాన్ దివాస్‌ను నిర్వహిచారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పోతుల రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ దేశంలో సమగ్రత సమైక్యత కోసం భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందన్నారు. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన ప్రమాదకరమైన ఆర్టికల్ 370ను విభేదించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ.. ఆ తర్వాత భారతీయ జనసంఘ్ పేరుతో రాజకీయ పార్టీ పెట్టి ఆర్టికల్ 370కు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారన్నారు. దేశ సర్వభౌమాధికారాన్ని పరిరక్షించుకునేందుకు బలిదానం చేసిన చరిత్ర జనసంఘ్‌దేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా కార్యదర్శి ప్రతాప్ ఆచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నూలు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మధు గౌడ్, రాజశేఖర్, రమణయ్య, చింతా నాగేశ్వరరావు, ధనుంజేయుడు పాల్గొన్నారు.

● **బండి ఆత్మకూరు:** డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామంలో సోమవారం ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చింత నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎం .శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరు: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మైనార్టీ మోర్చా మోమిన్‌షబానా, బీజేపీ సీనియర్ నాయకుడు వెంకసుబ్బయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు.

డీపీఆర్‌ఓగా సీహెచ్ పురుషోత్తం



బాధ్యతలు చేపట్టిన పురుషోత్తం

నంద్యాల: నంద్యాల సమాచార, పౌర సంబంధాల జిల్లా అధికారిగా సోమవారం సీహెచ్ పురుషోత్తం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీపీఆర్‌ఓగా పని చేస్తున్న మల్లికార్జున అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాజకుమారి సలహాలు, సూచనలు పాటిస్తూ శాఖా పరంగా జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన చర్య లు తీసుకుంటానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తు న్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా విస్తృతం చేస్తామన్నారు. నూతన డీపీఆర్‌ఓకు సిబ్బంది పూల బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. కాగా బదిలీపై వెళ్తు న్న డీపీఆర్‌ఓ మల్లికార్జునను సిబ్బంది కలెక్టరేట్‌లోని ఆ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

పాములపాడు: వాహనదారులు రోడు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సురేష్‌బాబు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

పేదలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

నందికొట్కూరు: పేదలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, నాగార్జున విమర్శించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఇంటి స్థలాలు ఇచ్చి, గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఏసన్న, సుధాకర్; సోమన్న, రామకృష్ణ, ఎల్లనాయుడు, ఇజ్రాయేల్, వెంకటేశ్వర్లు, వేణు, నరసింహ, మధు, నారాయణ, బీబీ, లక్ష్మీదేవి, మల్లేశ్వరమ్మ, శ్యామల, గోవిందమ్మ పాల్గొన్నారు.

అమ్మవారి చీరల విక్రయం ద్వారా రూ.1.50 లక్షలు

మహానంది: దేవస్థానంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల విక్రయం ద్వారా రూ. 1.50 లక్షలు వచ్చినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు మరోసారి శ్రావణ మాసంలో చీరల విక్రయానికి ఏర్పాట్లు చేస్తామన్నారు.

మిగులు సీట్లకు నేడు ప్రవేశ పరీక్ష

మహానంది: ఎం.తిమ్మాపురం ఏపీఈ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లకు మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మణరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్ష ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించామని తెలిపారు.

విద్యార్థులందరికీ తల్లికి వందనం వర్తింపజేయాలి

జూపాడుబంగ్లా: విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఆర్ శరత్ డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. సోమవారం జూపాడుబంగ్లాలో డీఎస్‌యూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల మంది విద్యార్థులుంటే కేవలం 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికివందనం పథకం వర్తింపజేయటం సిగ్గుచేటన్నారు. మిగిలిన విద్యార్థులకు కూడా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా మద్దూరు వీరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేటూరి రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులుగా డోన్ అశోక్, బేతంచెర్ల వెంకీ, జిల్లా సహాయ కార్యదర్శులుగా రంజిత్‌కుమార్‌రెడ్డి, మంత్రాలయం శేఖర్‌లను ఎన్నుకున్నారు.

ఆత్మకూరులో 22.4 మి.మీ. వర్షం

ఆత్మకూరు: మండలంలో సోమవారం తెల్లవారుజామున 22.4 మి.మీ. వర్షం కురిసినట్లు రెవెన్యూశాఖ అధికారులు తెలిపారు. వారం రోజులుగా వాన జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈక్రమంలో వర్షం పడటంతో సాగు చేసిన పైర్లకు ఎంతగానో అనుకూలమని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

● **మహానంది:** మండలంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. వర్షం కారణంగా ప్రతి సోమవారం, శుక్రవారం జరిగే పల్లకీసేవను రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు



అవగాహన కల్పిస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈ.మోహన్‌రెడ్డి

ఆత్మకూరు: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆత్మకూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈ.మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి జోలికి విద్యార్థులు వెళ్లరాదన్నారు. వాటి వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేసినా, తయారు చేసినా అలాంటి వారి వివరాలను 9440902585, 8328307774, 9177299067 నంబర్‌లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు

పాములపాడు: భూములకు సంబంధించి సమస్యలపై ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభద్రమ్మ రైతులకు హామీ ఇచ్చారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులు భూములు సర్వే కోసం అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీటన్నింటిని పరిశీలించి సర్వే అధికారులకు అందజేస్తామన్నారు. రైతుల భూములను కొలతలు వేయించి పరిష్కరిస్తామని వివరించారు.

– **బండి ఆత్మకూరు:** అధికారులు చెప్పినప్పటికీ తమ ఇంటి పక్కన ఉన్న వారు కులాయి కనెక్షన్‌కు అవకాశం ఇవ్వడం లేదని మండల కేంద్రానికి చెందిన మాదాసు కృపమ్మ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేసింది.

– **కొత్తపల్లి:** స్థానిక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులు కలసి నిర్వహించారు. ఒకరైతు పొలం కొలతలు వేయాలని, మరో రైతు తన పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని వినతి పత్రాలు ఇచ్చారని తహసీల్దార్ ఉమారాణి తెలిపారు.

సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలి

నందికొట్కూరు: సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ గ్రామ సర్వేయర్ల సంఘం నాయకులు రాంబాబు, అజీమ్, జయచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం మిడుతూరు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ సర్వే వల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని ప్రభుత్వానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తమకు జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరణ చేయాలని కోరారు. పదోన్నతులు, బదిలీలు సొంత మండలంలోనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సత్యనారాయణ, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

జూపాడుబంగ్లా: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్ బాబు తెలిపారు. సోమవారం చాబోలు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నోపోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగార్చుతున్నాయన్నారు. సమానపనికి సమానవేతనం కల్పించటంతో పాటు ఉద్యోగభద్రత, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సమ్మెను జయప్రదం చేయండి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: జులై 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న కార్మికులను కోరారు. సోమవారం సున్నిపెంటలోని స్వామిరెడ్డి భవనంలో కార్మిక సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా సుంకన్న మాట్లాడుతూ కార్మికులు గతంలో పోరాడి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నారన్నారు. ప్రస్తు తం కేంద్ర ప్రభుత్వం వాటిని 4 చట్టాలుగా రూపొందించి కార్మికుల నెత్తిన పని భారం, ఆంక్షలు విధిస్తుందన్నారు. పని గంటలను పెంచడం, మహిళా కార్మికులు సైతం రాత్రి వేళల్లో పనులు చేయాలనడం, కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్రం చట్టాలు తీసుకురాబోతుందన్నారు. కేంద్రం తీరును ఎండగట్టేందుకు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కె.నాగిరెడ్డి, ఓబులయ్య, అనిల్‌కుమార్, వెంకట్, శంకర్, నరసింహ, టి.మల్లికార్జున, పులిరాజు, రమణమ్మ, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరలే వసూలు చేయాలి

మహానంది: దుకాణాల వద్ద దేవస్థానం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలు విక్రయిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని కార్యాలయ వర్గాలు తెలిపాయి. పాదరక్షలు భద్రపరుచుకునేందుకు చెల్లించాల్సిన రుసుము, అభిషేక సామాగ్రి, టెంకాయల ధరలు, నవగ్రహాల దీపారాధన వద్ద దీపాల ధరలు, సంప్రదాయ దుస్తుల వద్ద పంచల ధరలను తెలుపుతూ సమాచారం కేంద్రం సిబ్బంది ద్వారా భక్తులకు తెలిసేలా సోమవారం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. భక్తులకు తెలిసేలా సమాచారం కేంద్రం సిబ్బంది మైకుల్లో అనౌన్స్ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



అడుగేస్తే చిత్తడే!

దురుపాడు బీసీ కాలనీ రహదారిలో నిలిచిన నీరు

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో బీసీ కాలనీకి వెళ్లే రహదారి చిత్తడిగా తయారైంది. అటువైపు ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉంది. విద్యార్థులు రాకపోకలు సాగించే క్రమంలో కాలు జారి కింద పడుతున్నారు. కుళాయిల నుంచి, ఇళ్లల్లో నుంచి వదిలే వృథా నీరు, వర్షపు నీరు వెళ్లేందుకు మురుగు కాల్వలు లేకపోవడంతో రోడ్డుపైనే నిలిచిపోవడంతో పరిసరాలు చిత్తడిగా మారుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్ని సార్లు పంచాయతీ కార్యదర్శులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.